కొత్తమ్మా.. కరుణించమ్మా..!

కోటబొమ్మాళి మండల కేంద్రంలోని కొత్తమ్మతల్లి అమ్మవారి శతాబ్ది ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మూడో రోజైన గురువారం అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. చివరి రోజు కావడంతో భారీగా తరలిరావడంతో కోటబొమ్మాళి జనసంద్రమైంది. సంప్రదాయబద్ధంగా అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. –టెక్కలి



కొత్తమ్మతల్లికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త సీదిరి అప్పలరాజు దంపతులు



కొత్తమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్న సంతబొమ్మాళి మండల జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి



ఉత్సవంలో థింసా నృత్య ప్రదర్శన



ఘటాల ఊరేగింపులో కేరళ డ్రమ్స్ ప్రదర్శన



అమ్మవారి దర్శనానికి ఎగబడుతున్న భక్తులు



ప్రత్యేక ఆకర్షణగా బొమ్మలు

క్లుప్తంగా

రోడ్డుపై ఇంటి నిర్మాణం పరిశీలన

సాక్షి ఎఫెక్ట్...

సంతబొమ్మాళి: మండలంలోని మలగాం పంచాయతీ బొడ్డువానిపేటలో సీసీ రోడ్డుపై నిర్మించిన ఇంటిని పంచాయతీ అధికారులు గురువారం పరిశీలించారు. 'సీసీ రోడ్డుపై ఇల్లు' నిర్మాణం శీర్షిక 'సాక్షి'లో గురువారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి రంజిత్ కుమార్, సచివాలయ సర్వేయర్ శివ కలిసి స్థలాన్ని పరిశీలించారు. సీసీ రోడ్డుపై ఇల్లు నిర్మాణం వాస్తమని తదుపరి చర్యలకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పంచాయతీ కార్యదర్శి రంజిత్ కుమార్ తెలిపారు.

రైతులకు యూరియా కష్టాలు



ఎరువుల కోసం క్యూలో నిలబడిన రైతులు

వజ్రపుకొత్తూరు రూరల్: పంటలకు అవసరమైన యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం పంట ఎదుగుదలకు యూరియా ఎంతో అవసరం. అయితే రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్‌కు తగ్గట్టుగా యూరియాను సరఫరా చేయడం లేదు. దీంతో యూరియా కోసం రైతులు రోడ్డెక్కుతున్నారు. కూపన్ల కోసం ఒక రోజు, యూరియా కోసం మరో రోజు గంట కొద్దీ మండుటెండలో వేచి ఉంటున్నారు. చినబాడాం రైల్వేస్టేషన్ గేట్ వద్ద ఉన్న ఓ ప్రైవేట్ ఎరువుల దుకాణం వద్ద గురువారం రైతులు యూరియా కోసం బారులుదీరారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసుల బందోబస్తు నడుమ ఎరువులను రైతులకు అందించారు.

పండిట్ దీన్ దయాల్‌కు ఘనంగా నివాళులు



నందిగాం: దీన్ దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నందిగాం: ఏకాత్మత మానవతావాది, సిద్ధాంతకర్త, అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ సిద్ధాంతాల నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలని బీజేపీ నందిగాం మండల అధ్యక్షుడు ఏదూరు కామరాజు అన్నారు. దేవుపురంలో దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దీన్ దయాళ్ చేసిన సేవలను కొనియాడారు. శక్తి కేంద్రం ఇన్‌చార్జి చింతాడ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఎ.కిశోర్‌కుమార్, టెక్కలి, పలాస మండలాల అధ్యక్షులు జె.రాంజీ, మామిడి ప్రసాదరావు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జెన్ని పరమేశ్వరరావు, శాసనపురి శ్రీను, జె.కుమారి, కామేశ్వరి, జయరాం పాల్గొన్నారు.

టెక్కలి: బీజేపీ వ్యవస్థాపకుడు పండిట్ దీన్ దయాల్ ఆశయాలను కొనసాగించాలని బీజేపీ మండల అధ్యక్షుడు జె.రామ్‌జీ కోరారు. తొలుసూరుపల్లి గ్రామం సమీపంలో దీన్ దయాల్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.మీనాకుమార్, కార్యకర్తలు ఎన్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలని మంత్రికి వినతి

ఇచ్ఛాపురం రూరల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 2019 నుంచి క్రాఫ్ట్, ఆర్ట్, మ్యూజిక్ టీచర్లుగా పనిచేస్తున్నప్పటికీ తమకు ఎటువంటి ఉపాధి కల్పించడం లేదని ఉత్తరాంధ్ర క్రాఫ్ట్, ఆర్ట్, మ్యూజిక్ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను అమరావతిలోని అతని చాంబర్‌లో కలిసి వినత పత్రం అందజేశారు. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది వివిధ కోర్సుల్లో శిక్షణ పొంది ప్రభుత్వ ఉద్యోగాలకు ఎదురు చూస్తున్నా ఫలితం లేదని మంత్రికి వివరించారు. తమకు న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఉత్తరాంధ్ర క్రాఫ్ట్ టీచర్ల ప్రతినిధి లోకేష్ తెలిపారు.

గరుడబద్రలో పారిశుద్ధ్య పనులు

వజ్రపుకొత్తూరు రూరల్: గరుడబద్ర పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గురువారం సర్పంచ్ గూడ గిరిజ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పలు రోడ్లు, కూడళ్ల వద్ద పేరుకుపోయిన చెత్త చెదారాన్ని, రోడ్లపైకి వ్యాపించిన పిచ్చి మొక్కలను తొలగించారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

మందు జాగ్రత్త తప్పనిసరి!

- పంటల సస్యరక్షణ చర్యల్లో రైతులు
- సూచనలు పాటించాలంటున్న అధికారులు

కంచిలి:

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలను కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉంటుంది. విత్తినప్పటి నుంచి వివిధ తెగుళ్లు దాడిచేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. దుక్కిపై జల్లే రసాయనిక ఎరువులతో పాటు స్ప్రేయింగ్ మందులను కూడా ఉపయోగిస్తే అనుకున్నంత దిగుబడి రావడానికి వీలుంటుంది. అయితే ఆ మందులను వాడడంలో తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని.. లేదంటే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరిస్తున్నారు.



పంట చేలో ఎరువు చల్లుతున్న రైతు

సస్యరక్షణ చర్యల్లో జాగ్రత్తలు ఇలా..

రెండు లేక మూడు రకాల మందులను కలిపి ఒకేసారి పిచికారీ చేయకూడదు. చేతులకు గ్లౌజులు, కళ్లకు అద్దాలు, ముక్కుకు మాస్క్‌ను తప్పనిసరిగా వినియోగించాలి.

- పురుగు మందుల డబ్బాలను నోటితో తీయకూడదు. మందు ద్రావకాన్ని చేతులతో కలపకూడదు. పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయకూడదు.
- పిచికారీ సన్నగా తుంపరలా పడేలా చూసుకోవాలి. మోతాదు ప్రకారమే కలుపుకోవాలి. అలాగే గాలి వాలుకు ఎదురుగా ఉండి పిచికారీ చేయకూడదు. పైరు పెద్దగా ఉన్నప్పుడు స్ప్రేయర్ మాత్రమే ఉపయోగించాలి.
- గాయాలైన చేతులతో మందులను తాకకూడదు. మందుల డబ్బాలు చిన్నపిల్లలకు అందకుండా జాగ్రత్తగా ఉంచాలి. ఖాళీ డబ్బాలను ఇంటి అవసరాలకు ఉపయోగించకూడదు. గొయ్యి తీసి వాటిని పాతి పెట్టేయాలి.
- పిచికారీ పూర్తయిన వెంటనే తప్పనిసరిగా స్నానం చేయాలి. పిచికారీ చేసేందుకు ధరించిన దుస్తులను ఇతర దుస్తులతో కలిపి ఉతకకూడదు.

అవసరం మేరకు వినియోగించాలి



ఎరువులు, మందులను పంటల అవసరం మేరకు వినియోగించాలి. ఏ పంటకైనా మొదటి 45 రోజుల్లో వచ్చే తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం ఉంటుంది. రైతులు వ్యవసాయాధికారుల సలహాలను పాటిస్తే ఆశించిన దిగుబడి వస్తుంది.

–కె.జగన్మోహన్‌రావు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, సోంపేట

సలహాలు అందిస్తున్నాం



రైతులకు ఎప్పటికప్పుడు పంటల సాగుపై సలహాలను అందిస్తున్నాం. ఏ సమయంలో ఎంత మోతాదులో మందులను ఉపయోగించాలో తెలియజేస్తున్నాం. నాణ్యమైన మందులు, ఎరువులను కూడా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతున్నాం.

– కొంకేన సురేష్, మండల వ్యవసాయాధికారి, కంచిలి

సాగునీటి కష్టాలు తీర్చండి

- శాసన మండలిలో ఎమ్మెల్సీ రామారావు

కవిటి: శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మాత్రమే సాగునీరు లేక వ్యవసాయ రంగం అభివృద్ధికి దూరంగా ఉందని ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గురువారం శాసన మండలిలో ఈ అంశంపై పలు కీలకమైన ప్రతిపాదనలను ప్రస్తావించారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఎక్కువసార్లు టీడీపీ అభ్యర్థులే ఇక్కడ నుంచి గెలిచినప్పటికీ రైతులకు సాగునీరు అందించాలన్న ఆలోచన రాకపోవడం శాపంగా మారిందన్నారు. 80 శాతం వ్యవసాయ ఆధారిత ప్రాంతం అయినప్పటికీ, సాగునీటి సమస్యలు పరిష్కారం కాక రైతాంగం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటుందన్నారు. నియోజకవర్గానికి వెన్నెముకగా ఉన్న పైడిగాం ప్రాజెక్టు శిథిలావస్థకు చేరిందని.. 60 సంవత్సరాల క్రితం ఏర్పాటైన ప్రాజెక్టును బాగు చేసుకుంటే 15 వేల ఎకరాలకు సాగునీరు ఉపయోగ పడుతోందన్నారు. కంచిలి మండలంలో ఏడు ప్రధాన సాగరాలు ఉన్నాయని చెప్పారు. గంగా సాగరం, ముకుంద సాగరం, పద్మనాభ సాగరం, గోవింద సాగరం, సుంకిలి సాగరం, లొద్దలుద్ది రిజర్వాయర్, హనుమంతు సాగరం పరిధిలో తొమ్మిది వేల ఎకరాలల ఆయకట్టు ఆధారపడి ఉందన్నారు. 400 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ సాగరాలకు నిధులు కేటాయించకపోవడంతో మరమ్మతులకు కూడా నోచుకోలేదన్నారు. చాలావరకు ఈ సాగరాలు ఆక్రమణలకు గురవుతున్నాయని మండలి దృష్టికి తెచ్చారు. సాగరాలతో పాటు బాహుదా నదిపై ఉన్న మూడు ఎత్తిపోతల పథకాలను కూడా మరమ్మతులు చేస్తే నియోజకవర్గంలో రైతాంగం పరిస్థితి బాగుతుందని అన్నారు. వంశధార–బాహుదా నదులను అనుసంధానం చేస్తామని గతంలో చంద్రబాబు హామీ ఇచ్చారని.. అయితే ఆ హామీ నెరవేర్చే ముందు మైనర్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



మండలిలో సాగునీటిపై మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఆదిత్యలో పుస్తకావిష్కరణ

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నూతన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళాశాలకు చెందిన అధ్యాపకులు ఎం.జయమన్మథరావు, డి. యుగంధర్,కె.శ్రీలక్ష్మి, శివశంకర్ రాజమణి రచించిన బయో మెడికల్ సిగ్నల్ ప్రాసెసింగ్ టెక్నిక్స్ అండ్ అప్లికేషన్స్ పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరవు ఆవిష్కరించగా.. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, వి.అశోక్‌కుమార్, ఎం.ఎస్.ఆర్.నాయుడు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

నందిగాం: పోషక విలువలు అధికంగా ఉన్న ఆహారాన్నే తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జలజాక్షి అన్నారు. దిమ్మిడిజోల సెక్టార్ పరిధిలోని కర్లపూడిలో ఎనిమిదో రాష్ట్రీయ పోషణ మాసోత్సవంలో భాగంగా వివిధ కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా జలజాక్షి మాట్లాడుతూ.. శారీరక, మానసిక ఆరోగ్యానికి పోషకాలు అవసరమన్నారు. సరైన పోషకాహారం తీసుకోకపోతే పోషకాల లోపంతో వ్యాధులబారిన పడతామన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతలో భాగంగా ఏక్ దిన్-ఏక్‌ఘంటే-ఏక్‌సాత్ కార్యక్రమం నిర్వహించి గ్రామస్తులతో గంట పాటు గ్రామంలో వ్యర్థాలు తొలగించి శుభ్రం చేశారు. అనంతరం అవగాహనా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది జి.జయలక్ష్మి, డి.రాణి, డి.శారద, బి.జయలక్ష్మి పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు

బ్రాహ్మణతర్లా, కేశుపురం బస్సు వేళల్లో మార్పు

పలాస: పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మండలంలోని బ్రాహ్మణతర్లా, కేశుపురం గ్రామాలకు వెళ్లే బస్సు వేళల్లో స్వల్ప మార్పులు చేశామని డీపో మేనేజర్ ఎం.ఎస్.ఎస్ నాయుడు గురువారం తెలిపారు. రోజు సాయంత్రం 4.30 గంటలకు పలాస నుంచి వెళ్లాల్సిన బస్సు ఇక నుంచి సాయంత్రం 5.15 గంటలకు బయలు దేరుతుందని.. ప్రయాణికులు సహకరించాలని కోరారు.

29న జిల్లాస్థాయి నృత్య పోటీలు

వజ్రపుకొత్తూరు: అమలపాడు(దాసరివానిపేట)లో ఈ నెల 29న జిల్లా స్థాయి మహిళల నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు సాయికిరణ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం తెలిపారు. 24వ వార్షికోత్సవం సందర్భంగా సరస్వతీ దేవీ పూజా మహోత్సవాలను పురస్కరించుకుని పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రూపు నృత్యాలకు మాత్రమే ప్రవేశం ఉందని, 15 ఏళ్లు పైబడిన అమ్మాయిలకు మాత్రమే పోటీలో పాల్గొనాలని, సినిమా, ఫోక్ సాంగ్‌లకు మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. పాటలకు సంబంధించిన దుస్తులు, ప్రాపర్టీస్ వారే తెచ్చుకోవాలని సూచించారు. పూర్తి పాట ప్రదర్శించాలని, రీమిక్స్‌కు అవకాశం లేదని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ. 25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 95020 69233, 97039 27643 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ పీవోకి అభినందనలు

వజ్రపుకొత్తూరు రూరల్: కాశీబుగ్గ–పలాసలోని ఎస్.బి.ఎస్.వై.ఎం. డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలుగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.మాధురి ఎన్‌ఎస్‌ఎస్ ఉత్తమ పీవోగా ఎంపికయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ పరిధిలో జరిగిన 57వ ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం అమెను రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎం.సుధాకర్, జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ వనజ చేతుల మీదగా సన్మానం చేసి సేవలను కొనియాడారు.

రాష్ట్రస్థాయి పోటీలకు డొంకూరు విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ క్రీడా మైదానంలో ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు డొంకూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు వజీర్ అహ్మద్ గురువారం తెలిపారు. అండర్–16 విభాగంలో టి.వినీత (హై జంప్), డి.మీనా (600 మీటర్ల పరుగు పందెం), ఎస్.మాధవి(పెంటథలోన్), ఎస్.రాంచరణ్ (పెంటథలోన్), అండర్–14 విభాగంలో బి.భరత్‌చంద్ర (షాట్‌పుట్)లు జిల్లా అథ్లెటిక్స్ తరఫున పాల్గొంటారన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



ఇచ్ఛాపురం: ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ రమేష్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు



పలాస: శ్రమదానం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఇచ్ఛాపురం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని ఇచ్ఛాపురం మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సురంగిరాజా క్రీడా మైదానం ఆవరణలో ఏక్‌దిన్-ఏక్‌గంటా-ఏక్‌సాథ్ నినాదంతో స్వచ్ఛంద సంస్థలు, క్రీడాకారులు, యువత, మెప్మా సిబ్బందితో కలిసి గురువారం మున్సిపల్ కమిషనర్, కార్యాలయ సిబ్బంది శ్రమదానం చేశారు. అనంతరం క్రీడా మైదానం నుంచి పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంపై బస్టాండ్ కూడలి వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ కూడలిలో మానవహారం చేసి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, మున్సిపల్ సిబ్బంది, రోటరీ క్లబ్ ప్రతినిధులు, స్వచ్ఛందసంస్థలు, క్రీడాకారులు, యువత, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల శ్రమదానం

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో గురువారం మున్సిపల్ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు శ్రమదానం చేశారు. 'ఒక రోజు–ఒక గంట–ఒక సారి శ్రమదాన్' సేవా కార్యక్రమంలో భాగంగా కాశీబుగ్గ బస్టాండు ప్రాంతంలో శ్రమదానంతో చెత్తను తొలగించారు. మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు పాల్గొని ప్రజలను పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు.

చంద్రమ్మ స్ఫూర్తితో కగార్‌కు వ్యతిరేకంగా పోరాటం

- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- న్యూడెమోక్రసీ నేత చిట్టిపాటి వెంకటేశ్వర్లు
- పైలా చంద్రమ్మకు ఘనంగా నివాళి

పలాస: సిక్కోలు పోరాట యోధురాలు, త్యాగశీలి పైల చంద్రమ్మ విప్లవ, అమరత్వ స్ఫూర్తితో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పోరాడాలని విప్లవ వీరమణులకు, ప్రజలకు సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కాశీబుగ్గ టి.కె.ఆర్ కళ్యాణ మండపంలో గురువారం పైలా చంద్రమ్మ ఐదో వర్ధంతి సభను నిర్వహించారు. ముందుగా అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం చంద్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీకాకుళం జిల్లా గిరిజన రైతాంగ పోరాటంలో అశువులు బాసిన అమరవీరుల ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నాటి శ్రీకాకుళ పోరాటం నుంచి నేటి దండ కారణ్యంలో మావోయిస్టుల ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాల క్రమాన్ని వివరించారు. ప్రజలు ముందుగా ఎప్పుడూ ఆయుధాలు పట్టలేదని, శ్రీకాకుళం పోరాటంలో కూడా భూస్వాములు వారి వద్ద ఉన్న తుపాకులతో ముందుగా ఇద్దరు గిరిజన నాయకులను కాల్చిచంపారని, ఆ తర్వాత గిరిజనుల చేసిన తిరుగుబాటును అణిచి వేయడానికి ప్రభుత్వం ఉద్యమంపై పోలీసు ఉక్కుపాదం మోపిందని, 360 మందిని పొట్టన పెట్టుకుందని గుర్తు చేశారు. ఇప్పుడు దండకారణ్యంలో కూడా అటవీ హక్కుల కోసం, అక్కడ ఖనిజ సంపదను కాపాడటానికి, అడవులను రక్షించడానికి ప్రజలు పోరాటం చేస్తే ఆపరేషన్ కగార్ పేరుతో వందలాది మంది గిరిజనులతో పాటు మావోయిస్టు నాయకులను, ముఖ్యమైన కార్యకర్తలను బూటకపు ఎన్‌కౌంటర్లతో హత్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ దమన కాండను ఆపాలని, మావోయిస్టులతో శాంతి చర్యలు జరపాలని కోరారు.

శ్రీకాకుళం జిల్లాలో కూడా విధ్వంసం సృష్టించే పరిశ్రమలను తెస్తున్నారని.. వాటికి వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేసి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. పలువురు వక్తలు చంద్రమ్మ త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో అరుణోదయం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, గొరకల బాలక్రిష్ణ, జుత్తు వీరాస్వామి, ఎం.వినోద్, కృష్ణవేణి, ఈశ్వరమ్మ,పోతనపల్లి కుసుమ, సారజగన్, కుత్తుం వినోద్, అరుణోదయ కళాకారులు పాల్గొన్నారు.



చంద్రమ్మకు నివాళులర్పిస్తున్న దృశ్యం